


# తానొకటి తలిస్తే

'శుమైతాంగి'

తానొకటి తలిస్తే: దైవమొకటి తలుస్తుందట. రామశర్మ, తన మేనకోడలు రాజేశ్వరి విషయంలో ఒకటి చేయాలని తలిస్తే అది ఆమెకు మేలే కలుగజేసింది.

అదెలా అంటే—

రాజేశ్వరికి పధ్నాలుగేళ్ళ వయసప్పుడు స్కూల్లో మూడవ ఫారమ్ చదువుతూ వేసవి శలవులు గడపడానికి మేనమామల వూరు అనకాపల్లి వెళ్ళి తిరిగి ఏలూరు వస్తుంటగా నిడదవోలు స్టేషన్‌లో బండి ఓ గంట ఆగిపోవాల్సివచ్చింది. అందుక్కారణం, లైనుమీద ఓ గూడ్సు బండి పట్టాలు తప్పి ప్రయాణానికి అవరోధం, కల్పించడమే.

ఆమాటకి ప్రయాణీకులు వుసూరుమని నిట్టూర్చారు. అంతకు మించి వాళ్ళు మాత్రం ఏం చేయగలరు? కొందరు కబుర్లు చెప్పుకోవడం, మరికొందరు నిద్రలో జోగడం చేస్తున్నారు.

రామశర్మ ప్రక్కన కూర్చున్న వ్యక్తి రామశర్మ నుద్దేశించి 'మీరెందాక వెళ్తున్నారు' అని అడిగాడు.

'గుడివాడ వెళ్ళాలి. ఈ బండి చూస్తే ఇక్కడే బైఠాయించింది' అతగాడు విసుగ్గా జవాబు చెప్పాడు.

'ఏలూర్లో దిగి బస్సుకి వెళ్తారా?'

అతను అవునన్నట్లు తల వూపాడు.

'ఒక్కొక్కసారి అంతే. అనుకోని సంఘటనలు జరుగుతుంటాయి. ఆ అమ్మాయి యెవరూ? మీ అమ్మాయేనా?' ఆ వ్యక్తి రామశర్మ ప్రక్కన బుద్ధిగా కూర్చున్న రాజేశ్వరి వైపు కుతూహలంగా చూసాడు.

'మా మేనకోడలు' టక్కున జవాబిచ్చిన రామశర్మ అతనితో సంభాషణ పెంచుకోవడం ఇష్టం లేనట్లు మరోవైపుకి చూపు త్రిప్పుకున్నాడు. కాని ఆ వ్యక్తి అంతటితో వదిలిపెట్టలేదు. 'అమ్మాయి చాలా అదృష్టవంతురాలౌతుంది. బాగా చదువుకుంటుంది. కోరినవాడిని పెళ్ళి చేసుకుంటుంది కాని....' అంటూ మాటని అసంపూర్తిగా ఆపేసాడు ఆ వ్యక్తి.

'ఊ కాని అంటూ ఆపేసారేమిటి' ఇటు తిరిగి ఆత్రంగా అడిగాడు రామశర్మ.

'అది మీరు వినాల్సింది కాదులెండి' అన్నాడతను గడుసుగా.

'అంటే....?' రామశర్మలో అనుమానం చోటు చేసుకుంది. 'ఇతగాడు కాని అంటూ ఆగిపోయాడేం. ఆ కాని అనే మాటలో ఏం అర్థం దాగివుందో' అనుకోసాగాడు. అసలు అనుమానం అంటూ కలగనేకూడదు. కలిగిందా ఆ స్థానంలో నానావిపరీతార్థాలూ తలెత్తి అతని మనసుని ఛిన్నాభిన్నం చేస్తాయంటే అతిశయోక్తి కాదు.

రామశర్మ మనసూ అలానే వుందిప్పుడు. ఆ వ్యక్తి ముగించకుండా వదిలిపెట్టిన వాక్యంలో అంతరార్థం తెలుసుకుంటేగాని మనసు శాంతించేలా లేదు.

'మీకు జోతిష్యం తెలుసు కాబోలు. 'కాని' అంటూ ఆపేసారు, ఏఁవీ అనుకోను చెప్పండి' అన్నాడు నవ్వుతూ.

'బాగా తెలీదు. ఏదో కొద్దిగా చెప్పగలను. ఏదమ్మా, చెయ్యి ఇటివ్వు.' అంటూ రాజేశ్వరి అరచేతిలో రేఖలు చూడసాగాడతను.

'ఊఁ మిడిమిడి జ్ఞానమన్నమాట' మనసులోనే గొణుక్కుని పైకి 'దీని చదువు సంగతి తర్వాత చూద్దురుగాని కాని, పెళ్ళి ఎప్పుడవుతుందో చెప్పండి' అన్నాడు రామశర్మ.

'అయిదారేళ్ళ వరకూ పెళ్ళిమాట తలపెట్టకుంటేనే మంచిది.

'అంటే?....ఓవేళ గట్టిగా చేయాలని ప్రయత్నిస్తే...'

'అది కలిసిరాదు. అమ్మాయికి ద్వితీయం ఉందండీ' అతను తటపటాయిస్తూ చెప్పాడు.

ఆ మాట వింటూనే రామశర్మ ఛీత్కారం చేసాడు. 'మా ఇంటా వంటా లేవు అటువంటి అనాచారప్పనులు. మాది నిప్పులు కడిగి శుద్ధి చేసుకునే వంశం. ఆ మాట మీరు గ్రహిస్తే మంచిది' రామశర్మ గర్వంగా అన్నాడు.

'కావచ్చు, దానిలో వింతేముంది? కులాలే కలిసిపోతున్నప్పుడు వంశం, ఆచారం అంటూ ప్రత్యేకించి వుంటాయా? అయినా యోగం తప్పించలేరు ఎవరూను' మెత్తగా చెప్పినా ఆ మాటల్లో పదునుంది.

'ఆ యోగాన్ని నేను తప్పిస్తాను సరేనా' పళ్ళు పటపటమనిపించాడు రామశర్మ.

'అది మీవల్ల కాదు' అతను సవాల్ చేసాడు.

'ఎందుకు కాదో నేనూ చూస్తాను, మీరే ఓడిపోతారు?'

'నా మాటే జరగన్నాడు నేను జ్యోతిష్యాన్ని విడిచిపెట్టి కట్టుబట్టల్తో సన్యాసుల్లో కలిసిపోతాను' అన్నాడతను.

రైలు పెట్టెలో తతిమ్మా ప్రయాణీకులు కుతూహల దృష్టితో వాళ్ళనే చూడసాగారు. వాళ్ళ చూపులు రామశర్మను ముళ్ళలా పొడుస్తున్నాయి. మరక్కడ కూర్చో బుద్ధిపుట్టలేదు. 'ఇక్కడ స్టేషన్ సమీపంలో మీ పెద్దనాన్న వున్నాడే రాజీ అక్కడకు వెళ్ళొద్దాము రా' అంటూ ఆ పిల్ల చెయ్యి పట్టుకుని లాక్కుపోయాడు. అలా వెళ్ళిన రామశర్మ ఎక్కడకూ వెళ్ళలేదు. మరో పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు 'పీడా విరగడయ్యింది' అనుకుంటూ. కాని అతని చెవుల్లో ఆ జ్యోతిష్కుడి మాటలే రింగుమంటున్నాయి. 'ఈ అమ్మాయికి ద్వితీయం వుంది' అంటూ.

ఆదెలా? ఛీ.... వెధవ ముండకి మళ్ళీ పెళ్ళా? అటువంటి అనాచారప్పనులు మా వంశంలోనే లేవు–గర్జిస్తున్నది మనసు. 'నయం. ఈ ముదనష్టపు దానికి పెద్దాడు క్రిష్ణశర్మను చేయాలనుకున్నాను సుమా. తొందరపడి మాటివ్వాను కాదు. జీవితాంతమూ దుఃఖపడేవాడివి. చూస్తూ చూస్తూ వెధవ ముండరాత వున్నదాన్ని ఎలా చేయనూ? తెలియకపోతే ఏఁవో, తెలిసే గోతిలో పడనా?' జ్యోతిష్కుడి మాటల మీద నమ్మకం లేకపోయినా ఈ మాటను మాత్రం కాదనుకోలేకపోతున్నాడు రామశర్మ. 'మరి నీ తోడబుట్టిన దానికేమని చెప్తావు?' అడిగింది అంతరాత్మ. అందుకేదో ఉపాయం చూడాలి మరి.... ఎత్తులు వేయడంలో రామశర్మ అద్వితీయుడు.

'నీ కొడుక్కి నా పిల్లను చేసుకోవుట్రా' అని చెల్లెలు అడిగినప్పుడు 'వాడికి జాతకం రాయిస్తే ద్వితీయం ఉందని తెలిసింది. చూస్తూ చూస్తూ నీ కూతురి ఉసురు ఎలా తీయనే మంగా' అన్నాడు తన విచారవదనంతో.

ఆ మాట విన్నాక మళ్ళా మేనల్లుడి పెళ్ళి మాట ఎత్తలేదు మంగమ్మగారు. 'అయితే దాన్ని ఓ యింటిదాన్ని చేసే భారం నీదే అన్నయ్యా' అందామె కూతురి పెళ్ళి బాధ్యత అన్నగారి మీద మోపుతూ.

'అదంతా నాకొదిలేసి నువ్వు నిశ్చింతగావుండు' అన్నాడు రామశర్మ. అన్నమాట ప్రకారం నెలన్నా తిరక్కుండానే రాజేశ్వరి పెళ్ళి జరిపించేసి 'అమ్మయ్య ఇక నా కొడుక్కి ప్రాణభయం లేదు' అని తృప్తిగా నవ్వుకున్నాడు కూడా.

రైలు మిత్రుడు చెప్పిన జోస్యంలో సగం జరిగిపోయిందప్పుడే. పెళ్ళయిన ఏడాదికే, పదిహేనేళ్ళన్నా నిండకుండానే రాజేశ్వరి పసుపు కుంకాలు పోగొట్టుకుని పుట్టిల్లు చేరింది. రామశర్మ గుండె గతుక్కుమంది. 'పంతాలకు పోయి పిల్లదాని గొంతు కోసానే' అని మనిషిగా కాస్సేపు బాధపడినా, 'ఊఁ ఎవరి రాత కెవరు కర్తలం' అని సమాధానం చెప్పుకుని తృప్తిపడ్డాడు.

'అయితే అతగాడు చెప్పినట్లు దీనికి ద్వితీయ వివాహం కూడా అవుతుందా?' ఏఁవో ఈ రోజులలాగే తగలడ్డాయి. ఆశయాలు, ఆదర్శాలూ అంటూ మొగపిల్లలు, ఆడపిల్లలూ, మరీ బరితెగించి పోతున్నారు. అటువంటి బావతుగాడెవడో రాజీని చూసాడంటే దాని అందానికి ముగ్ధుడై ఎగరేసుకు పోవడం ఖాయమేను. ఆడవాళ్ళ అందాన్ని మరింతగా ఇనుమడింపజేసేది జుత్తే కదూ–ఆ జుత్తే తీయించేస్తే?....వికారంగా వున్న రాజీని పెళ్ళి చేసుకుంటానని ఎవరూ ముందుకి రారు'. అతనిలోని దానవుడు విజృంభించాడు. వికటాట్టహాసం చేసాడు.

మొగుడు పోయిన ఆడదానికి జుత్తు తీయించే ఆచారం పెట్టిన తన పూర్వీకులను ఎంతయినా మెచ్చుకున్నాడు.

చెల్లెలి దగ్గరకెళ్ళి 'రాజీకి జుత్తు తీయించరా' అన్నాడు. 'అంత చిన్నపిల్లకు జుట్టెలా తీయించేదన్నయ్యా–ఇప్పటికే తొందరపడి దాని బ్రతుకు అన్యాయం చేశాము. ఆ జుట్టు కూడా తీయించి

దాన్ని వికారంగా చేస్తే ఏం బాగుంటుంది? పైగా అది చదువుకుంటానంటున్నది కూడా' అందామె. దగ్గుత్తికతో.

'మొగుడు చచ్చిన ముండ మూల కూర్చోక తగుదునమ్మా అంటూ చదువుకుంటుందా? సిగ్గు....సిగ్గు....దానికి లేకపోతే నీ కన్నా లేదూ? ఇవ్వాళ చదువుకుంటానంటుంది, రేపు నాకు తోచడం లేదంటూ ఉద్యోగానికి సిద్ధపడుతుంది. ఆ తర్వాత 'మా ఆఫీసులో గుమస్తాని ప్రేమించాను పెళ్ళి చేసుకుంటాను' అంటుంది. అప్పుడేమంటావు? ఈ కోర్కెలకంతంటూ వుంటుందా? అందుకే మొదట్లోనే వాళ్ళ కోర్కెను అణచి వేయాలి. మన వంశంలో ఇలా ఎప్పుడన్నా జరిగిందా? మన మేనత్తకు పన్నెండో ఏట పెళ్ళయింది. పెళ్ళయిన పదిహేను రోజులకే మొగుడు చస్తే బుర్ర గొరిగించి ఇంట్లో కూర్చోబెట్టారు. ఆ సంగతి నీకూ తెలుసు కదా? మన వంశ గౌరవం, పరువు ప్రతిష్ఠా పది కాలాల పాటు వుండాలని నీకు లేదా?' అంటూ దుయ్యబట్టాడు రామశర్మ. అన్నగారి వాగ్ధాటికి ఆగలేని మంగమ్మగారు చివరకు ఆయన మాటని పాటించక తప్పలేదు.

తన తలనీలాలు తీయించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని గ్రహించిన రాజేశ్వరి గుండె ఝల్లుమందొక్కసారిగా. అందుకు మూల కారకుడు మేనమామ అని కూడా తెలుసుకుంది. తనమీద మామయ్యకింత కక్ష దేనికో? తల్లిని చాటుగా బ్రతిమాలుకుంది తన జుత్తు తీయించవద్దని. అన్నదమ్ములను తండ్రిని అందరినీ వరుసగా వేడుకుంది కాని ఆ యింట్లో తన మేనమామ మాటకు ఎంత శక్తి వుందో తెలిసి వచ్చిందా క్షణంలో. అందుక్కారణం వాళ్ళెవరూ ఎదురు చెప్పలేకపోవడమేను.

ఇక ఎవర్ని బ్రతిమాలినా లాభం లేదని తన ధైర్యసాహసాలనే నమ్ముకుంది చివరకు.

రేపు జుట్టు తీస్తారనగా ఆ రాత్రి పరారైపోయింది రాజేశ్వరి. తెల్లవారేసరికి ఊరంతా గప్పుమంది. 'శాస్త్రిగారమ్మాయి ఎవరితోనో లేచిపోయింది' అనే వార్తతో.

'పారిపోయిన మేనకోడలిని వెతికి తీసుకొచ్చి జుట్టు గొరిగించకపోతే నా పేరు రామశర్మే కాదు' అని ప్రతిజ్ఞ పట్టిన రామశర్మ రాజేశ్వరి కోసం చాలా వూళ్ళు వెతుకుతూ తిరిగాడు. చాలా డబ్బు ఖర్చుపెట్టాడుకాని అతని ప్రతిజ్ఞ తీరలేదు. కాని తన కొడుకు ప్రాణ రక్షణార్థం ఆడిన నాటకం మరోలా నిజమయ్యింది.

బాగా డబ్బు తెచ్చుకున్న అమ్మాయినే కొడుక్కి చేసాడు. ఏడాది గడవకుండానే కోడలు ప్రసూతి రోగంతో కన్ను మూసింది. పుట్టిన పసికందూ పురిటిలోనే పోయింది.

ఆ కొడుక్కి మళ్ళా పెళ్ళి చేయాలనుకున్నాడు కాని ఆ కొడుకు అందుకు అంగీకరించడం లేదు,

'రాజిని ఇంటికి దూరం చేసాను. కొడుక్కి సంసారయోగం లేకుండా చేసాను. బంధువులతో విరోధం తెచ్చుకున్నాను' గతాన్ని తల్చుకుని పశ్చాత్తాపపడుతుంటాడు రామశర్మ.

ఏడెనిమిదేళ్ళు గడిచిపోయాయి. రామశర్మ కుటుంబంలో చాలా మార్పులు వచ్చాయి. వృద్ధాప్యంమీద పడిన అతన్ని ఎవరూ లెక్కచేయరిప్పుడు. అతని కొడుకులు విడిపోయారు ఆస్తి పంచుకుని. ఏ కొడుకూ చూడకపోయినా తండ్రి అనే అభిమానంతో పెద్దకొడుకు క్రిష్ణశర్మే అతన్ని దగ్గర పెట్టుకుని ఆదరిస్తున్నాడు. రామశర్మకు కేన్సర్ అన్నారు డాక్టర్లు. అతనికి ఎన్నో వైద్యాలు జరిపించాడు క్రిష్ణశర్మ. విశాఖపట్టణం తీసుకెళ్ళి అక్కడ మకాంపెట్టి తండ్రికి వైద్యం చేయించాడు. అక్కడ డాక్టర్లు పెదవి విరుస్తూ 'లాభం లేదు. మందులు తృప్తి కోసమే కాని, కొన్ని నెలలకన్న ఎక్కువ బ్రతకడం కష్టం' అని తమ అభిప్రాయం వ్యక్తంచేసారు. 'ఎక్కడ పుట్టానో అక్కడే మట్టయిపోతాను. ఇక్కడ నుంచి నన్ను తీసుకుపో' అంటూ కూర్చుంటే ఇక విధిలేక స్వగ్రామం బయలుదేరతీసాడు క్రిష్ణశర్మ.

వాల్తేరు స్టేషన్‌లో ట్రెయిన్ కోసం వాళ్ళు నిరీక్షిస్తూ కూర్చున్నారు. అప్పుడే ఓ జోడీ వాళ్ళప్రక్క నుంచి నడుస్తూ ముందు కెళ్తుంటే వాళ్ళని పరీక్షగా చూసిన రామశర్మ 'ఒరే, అబ్బాయి! ఆ వెళ్ళే అమ్మాయి రాజేశ్వరిలా లేదూ!' అన్నాడు ఆశ్చర్యంగా.

'అలాగే వుంది మరి కాని. అవునో కాదో?' అనుమానం వ్యక్తంచేసాడు క్రిష్ణశర్మ.

'అవునో కాదో ఏమిటి నీ మొహం! అది మన రాజేను,' అని, కంఠం పెంచి 'అమ్మాయ్ రాజీ,' అని పిలిచాడు తను ఆత్రంగా.

అతని అరుపుకి చాలా మంది ప్రయాణీకులు తిరిగి చూసారు. ఆ మనిషికి మతిగాని పోలేదు కదా....అలా గావుకేక వేస్తాడేం అన్నట్లు.

రామశర్మ ఎవర్ని ఉద్దేశించి అరిచాడో, ఆమె కూడా తిరిగి చూసింది. రామశర్మ చెయ్యి విసిరాడు రమ్మన్నట్లుగా.

ఆమె, ఆమె భర్తా వచ్చారు నమ్రతగా.

రామశర్మ ఊహ అబద్ధం కాదు, నిజమేను. కాకపోతే రాజేశ్వరిలో ఇప్పుడు పూర్తి అందం వుంది. మనిషి నిండుగా, హుందాగా, ఠీవిగా వుంది. వంటిమీద ఖరీదుగల పట్టుచీర వుంది. మెడలో నల్లపూసల గొలుసుతో కలిపి మరికొన్ని నగలున్నాయి. ఓ చేతికి వాచీ, మరో చేతి నిండా గాజులూ వున్నాయి. జుట్టు నున్నగా దువ్వి ఎత్తుగా ముడి వేసింది. పూర్తి నవనాగరీకతతో ఎట్టఎదుట నిలబడి వున్న రాజేశ్వరిని చూసి కళ్ళప్పగించేసాడు క్రిష్ణశర్మ. రామశర్మ కళ్ళు దిగ్భ్రాంతిగా చూస్తున్నాయి ఒకనాటి తన మేనకోడలిని.

తండ్రీ కొడుకుల వైపు ఓ క్షణం పరిశీలనగా చూసిన ఆమె ఆనందాతిరేకంతో 'ఓ మామయ్యా! రామశర్మ మామయ్యా! పెద్ద బావా!' అంది.

'అవును నేనేనమ్మా నీ బ్రతుకుని నవ్వులపాలు కావించిన మేనమామను. గుర్తుపట్టావా?' అన్నాడు వణికే స్వరంతో.

'ఓ! పట్టాను కదా? ఇలా ఎక్కడినుంచీ? ఎక్కడికి వెళుతున్నారు' అడిగింది రాజేశ్వరి.

'అంతా నా ఖర్మ. చేసిన పాపాలకు శిక్ష అనుభవిస్తున్నాను తల్లీ! నా గురించి ఏం అడుగుతావుగాని, నీ సంగతి చెప్పమ్మా, ఇన్నాళ్ళూ ఎక్కడ వున్నావు? ఏం చేస్తున్నావు? ఎలా బ్రతుకుతున్నావు?' ఆత్రంగా అడిగాడు రామశర్మ.

'నువ్వు చచ్చిపోయావనే అనుకుంటున్నాము రాజూ' అప్పటికి కంఠం పెగుల్చుకున్నాడు కృష్ణశర్మ.

'ఎందుకు చచ్చిపోతాను బావా. చచ్చేంత తప్పుకు పని ఏం చేసానని'....అందంగా నవ్వింది రాజేశ్వరి.

'ఈయన మా శ్రీవారు, పేరు సుధాకర్. డిగ్రీ ఎమ్. కామ్; హోదా ఆఫీసరు' ఆమె కళ్ళు గర్వంతో మెరిసాయి.

'అయితే పెళ్ళి కూడా చేసుకున్నావన్నమాట. ఇంకేం' రామశర్మ మనసులోనే గొణుక్కున్నాడు.


'ఆ రోజు మామయ్య నా జుట్టు తీయించాలనే పట్టుదల చూపించకపోతే నా అదృష్టం ఎలా

వక్రించేదోగాని ఓ రకంగా మామయ్య నాకు మేలే చేసాడని చెప్పాలి. ఆ ప్రయత్నమే లేకపోతే నేను ఇల్లు విడిచే పనే వుండదు కదా. వితంతువుని అయిన నేరానికి కన్నవారి వంచన అన్నదమ్ముల కుటుంబాలకు ఊడిగం చేస్తూ జీవితమంతా గడపాల్సి వచ్చేది. పన్నెండో ఏట వితంతువుగా ప్రవేశించిన మా సావిత్రి అత్త పరాయి పంచల్లో ఊడిగం చేస్తూ తనది, అనే స్వార్థం లేకుండా అందరూ నా వాళ్ళు, నా బంధువులు అనే నిస్వార్థంతో చాకిరీలు చేసి ఏ మాత్రం సుఖపడిందో నాకు తెలుసు. అదే రాత తిరిగి నాకు ఆపాదించాలని చూస్తున్న మామయ్య ప్రయత్నాన్ని విఘ్నం చేయడానికి, ఇంట్లోంచి పారిపోవాల్సి వచ్చింది.

'నేను ప్రయాణం చేస్తున్న పెట్టెలోనే అనాథాశ్రమానికి చెందిన ఓ మహిళతో పరిచయమైంది; ఆమెకి నా చరిత్ర చెప్పుకున్నాను కన్నీళ్ళతో. 'నీకొచ్చిన భయమేమీ లేదు నిన్ను స్త్రీ సేవా సదనంలో చేర్పిస్తాను' అని మాట ఇచ్చినట్లే నా గురించి చాలా శ్రమ తీసుకున్నారామె. ఆ సేవాసదనంలోనే నా భవిష్యత్తుకు పునాదులు వేసుకున్నాను. 'అనాథలను ఆదరించాలి, వాళ్ళకి మంచి భవిష్యత్తు కల్పించాలి' అని నలుగురికీ చెప్పి వాళ్ళచేత ఆచరింపజేసే ఈయన నన్ను చూశారు. దయతో నన్ను స్వీకరించారు. మా సంసార జీవితం సుఖంగా సాగిపోతున్నది. ఇదీ మా జీవిత చరిత్ర మామయ్యా—నువ్వు ఒకటి చేయాలనుకున్నావు. జరిగింది మరోటి. ఈ నా అదృష్టానికి కారకుడివి నువ్వే గనుక నీ మీద నాకెట్టి ద్వేషమూ లేదు మామయ్యా—ఉన్నది అభిమానమేను.' అంది రాజేశ్వరి నవ్వుతూ.

'మన ట్రెయిన్‌కి టైమయింది రాజీ' అన్నాడతడు.

'వస్తాను మామయ్యా. అమ్మకి నేను సుఖంగానే వున్నట్లు చెప్పు. ఆఁ అన్నట్లు మర్చిపోయాను. మేము కలకత్తా వెళ్తున్నాము. మా ఆడబడుచు అక్కడ వుంటున్నారు. చూట్టానికి వెళ్తున్నాము,' అంటూనే కలలో కనిపించిన దేవకన్యలా గుంపులో కలిసిపోయిన మేనకోడలిని చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు రామశర్మ. అతనికి రైలు మిత్రుడు చెప్పిన జోస్యం గుర్తొచ్చింది—'అవును రాజీ చాలా అదృష్టవంతురాలు' అనుకున్నాడు. □



# పుస్తకాలు

## పద్మాలు - పారిజాతాలు

### (కథల సంపుటి)

**[రచన: అడవి కొలను పార్వతి; క్రౌను 1/8 సైజులో 156 పేజీలు. వెల: రూ. 5-50; ప్రచురణ: రాక్షస వైశాఖలో, ప్రతులకు: రచయిత్రి, అపర్ణా పబ్లికేషన్స్, గాంధీనగరం, కాకినాడ-4]**

'పద్మాలు - పారిజాతాలు' ఆరు కథలతో కూర్చిన సంపుటి. ఈ ఆరు కథలలో మొదటి కథ 'పద్మాలు - పారిజాతాలు'. ఈ సంపుటిలో కథలన్నీ స్త్రీలకు సంబంధించిన సమస్యలనే ఇతివృత్తాలుగా తీసుకుని వ్రాసిన కథలే కావడం అభినందించవలసిన విషయం.

ఆర్థిక స్వాతంత్ర్యం లేని ఒక ఇల్లాలు - భర్త అతని ఆఫీసులో ఉద్యోగం చేస్తున్న అమ్మాయి ఆకర్షణలో పడి తనను హింసించగా ఎలా తల ఒగ్గి, చివరకు విజయం సాధించిందో తెలియజేస్తుంది 'పద్మాలు పారిజాతాలు' కథ. 'పునర్నవం' కథలో గ్రామాలనే ఆధునికంగా దిద్దుకుంటే గ్రామీణ స్త్రీలకు పట్టణ వ్యామోహాలు తగ్గి దేశం బాగుపడగలదనే ఆశాభావం కనిపిస్తుంది. "స్త్రీకి పురుషుడే ప్రధాన విరోధి కాడు. ఒక్కొక్కసారి సాటి స్త్రీని స్త్రీలు హింసించినంతగా పురుషులు హింసించలేరు" అని ఎవరో ఎప్పుడో అన్నారు. అలా తన భర్త, అత్తలూ, ఆడబిడ్డలూ, తోడి కోడళ్ళు మొదలైన వాళ్ళ హింసకు గురియైన యువతి కథే 'హరిణి-హర్యశాలు.' మనసును కదిలించే కథ అది. 'మట్టిలో మాణిక్యాలు' కథ ఒక రకంగా చూస్తే ఒక 'ఆధునిక పతివ్రత' కథ. 'మనసు కలియని మనువు' అనే చివరి కథ 'మనసొక చోట మనువొక చోట' అయి బానిసతనానికి బలి అయిన ఆధునిక బాలిక జీవితాన్ని వివరిస్తుంది. ఈ సంపుటిలో 'పరివర్తన' అనే మరో కథ కూడా ఉంది.

"స్త్రీలలో బానిస భావాల్ని, నైరాశ్యాన్ని అంతరింపజేసి స్వాతంత్ర్య భావాల్ని, హేతువాదాన్ని ఉద్దీపింపజేయాలని ఆశిస్తూ 1975 వనితా సంవత్సర సందర్భంగా" 'పద్మాలు పారిజాతాలు' వెలువరిస్తున్నట్లు రచయిత్రి పుస్తకం మొదటే తమ ఆశయాన్ని సూచించారు. ఆమె ఆశయం ఈ కథల సంపుటి ద్వారా కొంతవరకు నెరవేరిందనే చెప్పవచ్చు.

['పుస్తకాలు' శీర్షికలో సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు ఒక్క ప్రతిని పంపితే చాలు. ఆ పుస్తకాల ప్రచురణ మాత్రం, ఈ సంవత్సరంలోనే జరిగి వుండాలి; అవీ స్త్రీల రచనలే అయి వుండాలి.]